# స్వప్న మాధుర్యము

బి. ఎన్. రెడ్డి

ఆది నవనవలాడే వసంతకాలపు సాయంతనము. మనోహరమగు ప్రకృతి సౌందర్యము ననుభవించుచూ, ఎదుట కనబడు జలపాత సొబగులను సంతసించుచు, ప్రక్కన పరుగులిడు నీటికాలువలోని కెరటాల నానందించుచూ ఉన్న సమయం. ధగధగ మెఱసిపోవుచు, ధూళి ధూసరములతో ఏదో నావంక వచ్చుటనుచూచి ఆశ్చర్యచకితుడనై, విషయాన్వేషుడై వేచియుంటిని. తెల్లని గుఱ్ఱములతో రమణీయమగు రథమొక్కటి వచ్చి నాముందునిలబడెను. ఇదేమిటాయని సంభ్రమాశ్చర్యాలతో అటు నిటు, పైకి క్రిందికి చూచు చుంటిని.

"ఎవరు మీరు ? ఎందుకట్లు ఆశ్చర్యపడుచున్నారు ? నన్ను గుర్తింపలేరా ?" అని ఒక వాణి వినవచ్చెను. వెంటనే నాకు కనుపించినదెల్ల ఒక భువన మోహనసుందరాంగి. రంగుచీరెల సొంపు నింపుచు, మందహాసపు చూపు చూచుచు నావైపుకు రథము దిగి వచ్చుచుండెను. "దేవీ ! క్షమింపవలెను; తామెవ్వరో నాకు జ్ఞప్తికి రాలేదు ; సెలవిచ్చి స్వీకరింపవలెను." అని ప్రార్థించి నిలబడి యుంటిని. "మిత్రమా ! నేను సినిమాదేవిని. ఇంతలో మఱచినావా? రా ! నాతో కొంతసేపు విలాసముగా విహరించి వద్దువుగాని," అని నాచెయ్యి పట్టుకొని రథములో నెక్కించుకొనెను. వెంటనే ఆ రథము శరవేగమున, ప్రకృతి సౌందర్య రమణీయములతో నిండిన అడవులగుండా వెళ్లుచుండెను—వసంతుని విలాససృష్టి చూచుటకు కనుల కెంతో హాయిగా నుండెను. నేను, సమయము దొరికినది గాన, సందేహములనడిగి తెలిసికొనవచ్చునను ఉద్దేశముతో ఆమె వంక చూచినాను.

సినిమాదేవి : ఏమి మిత్రమా ! అట్లు చూచుచున్నావు ? నీ సందేహమేమి ? అడుగుము ! భయపడవలదు.

నేను : దేవీ ! నేను ఒక సినిమావానిని గనుక, కొన్ని సందేహాలున్నవి. వానిని మీవద్ద అడిగి తెలిసికొనవలయునని కుతూహలపడుచున్నాను. మీకు తెలియనిదేమి యుండదుగదా ?

సినిమాదేవి : అడుగు మిత్రమా !

నేను : ప్రస్తుతము తీయబడే చలనచిత్రములు సామాన్యముగా విజయవంతము గాకపోవుటకు కారణమేమి ?

సినిమాదేవి : ప్రజామోదం లేకపోవుటయే ఇందులకు గల కారణం. కథావస్తువు దాదాపు ఒకేమాదిరిగా యుండుటచే ప్రజారంజకము గాకున్నది. ఇదిగాక, సినిమాయనగా పెక్కు కళాకారుల సంఘీభావముచే ఏర్పడు ఒక నిర్మాణ సంపద.

ఈ నిర్మాణ కార్యములన్ని ఇప్పుడు ప్రొడ్యూసర్ల చేతి కీలు బొమ్మలైనవి. నటీనటులుకూడ తమ పాత్రపోషణాది నిర్ణీతాదర్శాలను మఱచి, ప్రొడ్యూసర్ల ఇష్టమునకు ప్రవర్తింపవలసి వచ్చినది. ఇది మాత్రమేగాక ఇప్పుడు ఒక పటముయొక్క జయాపజయములు దాని రాబడిమీదే నిర్ణయించు పద్ధతి అలవడెను. పూర్వమట్లుగాదు. ఒక పటముయొక్క జయాపజయములు దానియొక్క అంగ సౌందర్యాది కథావస్తు పాత్రపోషణాది విలువలను బట్టియు, దర్శకునియొక్క సందేశ చమత్కృతిని బట్టియు నిర్ణయింపబడుచుండెను. ఒక పటము ఓటమి గాంచినయెడల అందు పాల్గొన్న తారాగణముకూడ దానిని గుర్తించి పశ్చాత్తాప మొందవలెను. అప్పుడే ముందుముందు రాగల పటములు చక్కబడగలవు. ఇంతేగాక కొంతకాలమున ఎక్కువ రాబడి పొందవలెనని చేయుప్రయత్నముకూడ పటముల ఈ దుర్బలస్థితికి కారణము. ఈనాడు నటీనటులుకూడ తమ స్వాతంత్ర్యము మఱచి ధనవ్యామోహంలో పడి పెట్టుబడిదారులతో చేతులు కలుపుకొనుటయు ఈ మాంద్యమునకు మరియొక కారణము.

నేను : నటీనటులు ధనవ్యామోహ పీడితులై పోయినారనుట అంత సమంజసముగా లేదు. దీనికి కారణమేమి దేవీ ?

సినిమాదేవి : నేటి నటులకు ఒక స్థిరమైన హామీ ఏమీలేదు. అందుచే అవకాశము కలిగినపుడు ఏదో కూడబెట్టుకొనవలెగదాయని పెట్టుబడివాళ్లకు లోబడి తమ ఆదర్శపు కళాపోషణను అడుగంట మఱచిపోయినారు. వీరెట్లు కళాకారులగుదురు ? నిర్దుష్టముగా కళాసేవ జేసిననాడే కళాకారులు కాగలరు.

నేను : వీరికెట్లు దేవీ, స్థిరమైన రాబడికి హామీ ఇచ్చుట ?

సినిమాదేవి : ఏం ! ప్రజలు ఈ స్థితిని గుర్తించి ముందుకు రావలెను. లేదా ప్రభుత్వమైనను ఈ విషయంలో నిశితమైన ఒక పంథాననుసరించి కళాకారుల జీవితాన్ని వికాసముజేసి, వారిద్వారా స్వచ్ఛమైన కళాప్రసాదమును ప్రజానీకానికి అందివ్వవలెను. షెక్స్పియన్ల సేప్పును గుర్తించి, వారిలో తరగని ఉత్సాహమును ప్రతిపాదించుటకు దారితీయవలెను. దర్శకుల నైపుణిని తగురీతి సన్మానించవలెను.

నేను : ఒక్కమాట ! ప్రస్తుతము ప్రభుత్వము విజయవంతమైన పటాలకు బహుమతుల నేర్పఱచి ఎంతో సాయపడుచున్నదే ! ఇంకను ప్రభుత్వమును నిందించుటలో ఏమియర్థము దేవీ !

సినిమాదేవి : నిజమే ! ఆ బహుమానములు పెట్టుబడిదార్లకు బంగారు పతకములమూలాన పోయి చేరుచున్నవి. కొన్ని లక్షలు పెట్టుబడిబెట్టిన ఒక ప్రొడ్యూసరు నాలుగైదు నవరాల పతకమును పొందినంత మాత్రమున అతనికి ఆర్థికముగా చేకూరిన లాభ

మేమియులేదు. ఇక, నటీనటులకు పొగడ్త వార్తలచే కడుపునిండుటయు లేదు. అందుకనే ప్రభుత్వము విజయమునొందిన నటీనటులకు ఉపకార వేతనం వంటిదేదైనను ఏర్పాటుచేసి చిరస్థాయిగా వారు ఉన్నంతకాలం "పెన్షన్" ఇవ్వవలెను. ఆర్థికంగా సాయం కలిగిననాడే టెక్నీషియన్లకైనా, నటీనటులకైనా కళారాధన విషయంలో నిజమైన అక్కఱ కలుగును.

నేను : దేవీ ! మరియొక సందేహం ; ఉన్నత స్థాయికి చెందిన మంచి పటాలు కొన్ని సర్వతోముఖంగా పడిపోవుచున్నవే! ఇట్టి స్థితి సాగనిచ్చినచో కళానైపుణిని ప్రసాదించు ఉన్నతశ్రేణికి చెందిన పటాలు రాకపోవచ్చునేమో ?

సినిమాదేవి : మంచిప్రశ్న వేసినావు. ప్రభుత్వం ఇట్టి ఉన్నత చిత్రములను ఎన్నుకొని, ఆ ప్రొడ్యూసరుకు, ఆ పటము తీయుట కెంత ఖర్చు ఐనదో అంత మొత్తమును బహూకరించుట శ్లాఘనీయం. అప్పుడు ఆ పటము ఒక సమయము మంచి రాబడిని తెచ్చుకొన లేకపోయినను, మఱల నిరుత్సాహము నొందక, ఆ ప్రొడ్యూసరు మరొక ఉత్తమ చిత్రం తీయగలడు ఆర్థికసంపాదన మాత్రమేగాక, ప్రజాబాహుళ్యమునకు నీతిగఱపి, నాగరికతా బీజములను జ్ఞప్తిచేయగల ఉత్తమ చిత్రాలును మెండుగా సృష్టింపబడవలెను.

నేను : దేవీ ! చాలసంతోషం. సినిమా పరిశ్రమ అత్యున్నత స్థానము నొందుటకు కొన్ని సందేశాలిచ్చినచో బాగుండును. నావంటి వారు అనుసరించి అవలంబించుటకును తోడ్పడునేమో ?

సినిమాదేవి : చాల ఘటికుడవయ్యా ! అటు ఇటు ప్రశ్నలడిగి ఆధారభూతమైన రహస్యాలనే చెప్పి వేయమంటున్నావు. మంచిది. సావధానంగా వినుము.

1. ఒక కళాకారుడు ఒకే సమయమున ఒక పటమునకు మించి ఎక్కువ పటాలలో పనిచేయరాదు.

2. ఇట్లు చేసినయెడల ఉత్పత్తి ఖర్చులు 40% తగ్గుటతో బాటు, కాలవ్యయమును తగ్గును.

3. ఒకేమాటు ఒక కళాకారుని పటాలు పెక్కుచోట్ల ప్రదర్శించబడుటకన్న కాలవ్యవధి ఇచ్చి ప్రదర్శనాలు ఒకటి వెంబడి ఒకటి వచ్చుటచే కళాకారుని గౌరవం హెచ్చును.

నేను : ఇట్లు ఒకే పటమున పనిచేసినయెడల కళాకారుల రాబడి తగ్గిపోవును గదా ? అందుచే వారి జీవయాత్ర అతి దుర్లభమనిపించదా ?

సినిమాదేవి : పొరబాటు, ఎప్పుడు అట్లు అనుకొనవద్దు. కథావస్తువును చక్కగా పరిశీలించి, అన్ని కార్యక్రమాలు చక్కబెట్టుకొని, కాగితాలపని (Shooting Script) ముగించుకొని, పాటలు రికార్డుచేసి, షూటింగు మొదలుపెట్టిన యెడల ఒక పటమును నాలుగు మొదలు ఆఱుమాసాలలో ముగింపవచ్చును. అనగా ఒక సంవత్సరమున మూడు పటములలో నటించుటకు నటీనటుల కవకాశమున్నది. మూడు నాలుగు సంవత్సరాలలో పది, పండ్రెండు పటాలలో హాయిగా నటించవచ్చును. ఇట్లుగాక ఒకే సమయమున పది పండ్రెండు పటాలలో నటించ పూనుకొన్నను, అన్ని ముగియుటకు ఈ మూడు నాలుగు సంవత్సరాలు సులభంగా పట్టును. మొదట చెప్పినట్లు ఒక పటమైనపిదప మరొక పటమున నటించుచు వచ్చినయెడల, ప్రొడ్యూసర్లు, టెక్నీషియన్లు మొదలగు వారికి సులభము. పటాలును చక్కగా నుండును. రాబడియు బాగుగ రాగలదు. నటీనటులకును ప్రజానీకంలో మర్యాద కలుగగలదు. ఆర్థికంగా ఈ పద్ధతి అందరికి ఎంతో సాయకారిగా నుండును.

ఇంతేగాక ప్రొడ్యూసర్లుకూడ ఒక పటం తీయుటకు ఒక నిర్ణయమైన కాలమును ముందే నిర్ణయించుకొనవలెను.

అమెరికాలో కొన్ని పటములు రెండు మూడు వారములలో కూడ తీయుచున్నారు.

నేను : ప్లాను బాగుగనే యున్నది. కాని, ఒకే పటమున పనిచేయుటకు, మనకు కావలసినంతమంది టెక్నీషియన్లు ఉన్నారా?

సినిమాదేవి : సినిమాప్రపంచం టెక్నీషియన్లు పటముల జయాపజయాలకు కారణం అనే సూత్రాన్ని మఱచిపోవుచున్నది ప్రొడ్యూసర్లు తారాగణాలమీద చూపించు ఆదరాభిమానములను టెక్నీషియన్లవైపు చూపుటలేదు. మంచి టెక్నీషియన్లను సృజింపవలెనను ఆసక్తి అంతకంటే లేదు. ఉత్తమ చిత్రజగతికి ఎందరో కవులు, రచయితలు, దర్శకులు, కళారాధకులు, టెక్నీషియన్లు అభివృద్ధి నొందవలెను.

నేను : మనకు కావలసినంతమంది నటీనటులున్నారా ?

సినిమాదేవి : ఇంకను ఎందరో కొత్త ముఖాలను తీసుకొనవలెను. విదేశాలలో నాటకరంగములనుండి మంచి నేర్పుగల కళాకారుల నెన్నుకొనెదరు. మన దేశమున నాటకరంగం లంత అభివృద్ధి చెందియుండలేదు. మంచి కథావస్తువును నాటకముగా వేసి, దానిమీద సంస్కరణలు జేసి పటం తయారుచేయుట మంచిది. నాటకశాలల నిర్మాణమునకు అందఱు దోహద మివ్వవలెను. నటీనటుల ఎన్నికలో నాటకానుభవం కలవారికి ప్రధాన స్థానమిచ్చుట సమంజసం.

ఇట్టి సంస్కరణలచే సినిమారంగం శ్రేయోభివృద్ధి గాంచకలదు. మిత్రమా ! అప్పుడే చాలసేపైనది. నేను వెళ్ళివచ్చెదను. మఱల కలుసుకొందం.

అని నన్ను రథంనుండి దించివదలి సినిమాదేవి అంతర్ధానమయ్యెను. వెంటనే నేను లేచిచూచి, ఇదంతయు అదివఱకు నా స్వప్న సామ్రాజ్య వీరవిహారమే అని తెలిసికొంటిని.

ఏది ఎట్లయినను సినిమాదేవి ఆదేశాలు అవలంబనీయాలై ఆచరణరూపం దాల్చిననాడు మన సినిమారంగం చాలఉచ్చస్థితిని చెందగలదు.

http://www.maganti.org/

Source: Press Academy Website, Kinnera Magazine, 1955

Disclaimer: This SELECTIVE topic/article/write-up of B.N.Reddy gaaru is nostalgic. It has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience.

No intention what so ever of copy right violation is involved.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with due apologies.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/